ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 30.10.95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనస్సు, ఇంద్రియాలు బాహ్యాముఖంగా పరిగెడుతూ ఉంటాయి. మనస్సు యొక్క విజృంభణను, ఇంద్రియాల యొక్క విజృంభణను అదుపులోనికి తెచ్చుకోవటమే సాధనయొక్క పరమార్థము. గురువుపట్ల మనకు మానసిక అనుబంధము, ప్రేమ, ఆప్యాయత ఉంటే అదే మనలను హృదయ స్థానంలోనికి తీసుకొని వెళుతుంది.

ఉపదేశసారం చదివినా, భగవద్గీత చదివినా, ఉపనిషత్‌లు చదివినా అందులోని వాక్యములు చదివినంత మాత్రమున మనకు అనుభవంలోనికి రావు. వాక్యం మీరు చదువుతారు. ఆ వాక్యం అనుభవంలోనికి రావాలంటే సాధన చెయ్యాలి. సాధన చెయ్యకుండా వాక్యం అనుభవంలోనికిరాదు. మీరు చదివినది, విన్నది సాధన చేస్తే అనుభవంలోనికి వస్తుంది.

ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధముననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును. జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నము చేసినా జరుగనే జరగదు. ఇది నిశ్చయము. ఇది రమణ మహర్షి తల్లికి చెప్పిన ఉపదేశము. ఈ వాక్యమును మనం చాలా సార్లు చదివాము. ఈ వాక్యం అనుభవంలోనికి వస్తే మరుక్షణంలో దుఃఖము నశిస్తుంది. ఈ వాక్యం మనకు అర్థం కాలేదు అందువలన దుఃఖము నశించటం లేదు. రోజూ చదువుచున్నాము అనుభవంలోనికి రావటం లేదు ఎందుచేతనంటే మనకు సాధనలేదు.

కాలమును పాడు చేసుకోవద్దు. మీ ఇంటివద్ద పనులు శ్రద్ధగా చేసుకొంటూ మిగిలిన కాలమును భగవంతునికి అర్పించండి. భగవదనుభవం పొందటంకోసం ప్రయత్నించండి. భగవంతుడు కాలం రూపంలో ఉన్నాను అని చెప్పాడు కాబట్టి కాలమును దుర్వినియోగం చేస్తే భగవంతుని అగౌరవపరచినట్లు లెక్క. కాలమును ఎవరైతే సద్వినియోగం చేసుకొంటున్నారో వారు భగవంతుని అనుగ్రహమునకు పాత్రులవుతారు.

సాధన లేకుండా సిద్ధి కలుగదు. ప్రయత్నం చేయాలి. ఈశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఆయన మన ప్రయత్నమును చూస్తూ ఉంటాడు. ప్రయత్నం చేయగా చేయగా కాలం కలసి వస్తుంది. అప్పుడు ఈశ్వరానుగ్రహం కూడా వస్తుంది. అప్పుడు మనం ముక్తిని పొందుతాము.

ధర్మ, అర్థ, కామ మోక్షములు ఇవి నాలుగూ పురుషార్థములు. ధర్మ, అర్థ, కామములు కేవలము ప్రకృతికి సంబంధించినవి. ఇవి కాల ప్రవాహములో కొట్టుకొని పోతాయి. ముఖ్యమైనది, ప్రధానమైనది మోక్షము. మోక్షము పరతత్త్వమునకు సంబంధించినది. మోక్షమును సాధించాలంటే కాలమును సద్వినియోగం చేసుకోవాలి. మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సాధనకు కొంతకాలమును వినియోగించండి.

ఇటువంటి దేహాలు ఎన్నో మారి మారి ఇప్పుడు ఈ దేహంలోనికి వచ్చాము. మనకు ఈశ్వరుడు ఇంకా అనుభవంలోనికిరాకపోయినా పూర్వపుణ్యం వలన ఈశ్వరునివైపు మన మొఖం తిరిగింది. ఈ అవకాశమును ఉపయోగించుకోవాలి.

చాలాకాలమునుండి సాధన చేస్తున్నాను, శాంతి కుదరటం లేదు అని చెపుతూ ఉంటారు. సాధన చేసినపుడు అభివృద్ధి కాలమును బట్టి రాదు. మనం చేసే తీవ్రతను బట్టి, శ్రద్ధను బట్టి ఫలితం వస్తుంది. భగవంతుడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం ఉండాలి. పూర్వజన్మలు ఉన్నాయి, రాబోయే జన్మలు ఉన్నాయి. బ్రహ్మానుభవం కలిగే వరకూ జన్మ పరంపరలు మనలను విడిచిపెట్టవు. మనకు అనేక జన్మలు వెళ్ళిపోయాయి. ఏ దేహంలో ఉన్నప్పుడు అదే నిజం అనుకొంటున్నాము. ఇదే మాయ. మాయను తొలగించి చూస్తే మనం ఎవరిమో మనకు తెలుస్తుంది. మనం అందరమూ మాయలో ఉన్నాము. మాయను తొలగించుకోలేక పోతున్నాము. మాయ దారి ఇవ్వాలంటే ఈశ్వరానుగ్రహం ఉండాలి.

శాస్త్ర ప్రేమ తల్లి ప్రేమ లాంటిది. తల్లి బిడ్డలకు మరోసారి, మరోసారి ఎలా బోధిస్తుందో శాస్త్రము కూడా అలాగే చెప్పినదే చెపుతూ ఉంటుంది. మన గుండెకు బాగా హత్తుకోవటం కోసం అలా పదే పదే చెపుతుంది.

గురువును మనం దేహం అని అనుకోవచ్చును. కాని తాను దేహం కాదని గురువుకు తెలును. గురువు అంటే ఆత్మ. అది మన హృదయంలోనే ఉంది. మనం చేసే సాధనను చూస్తూ ఉంటుంది. వీడు సాధన చేస్తున్నాడు, వీడికి బాహ్యంగా కూడా కొంత సపోర్టు ఇవ్వాలి అనుకొన్నప్పుడు ఆత్మే కాళ్ళు, చేతులు తొడుగుకొని వస్తుంది. వాడే గురువు. మనం కాళ్లతోనూ, చేతులతోనూ, ఆ శవంతోనూ తాదాత్మ్యం పొందుతాము. తాను ఆ దేహం కాదు, అని, తాను ఆత్మ అని గురువుకు తెలుసు. నీకు ఆత్మానుభవం కలిగే వరకూ గురువుతో ఉన్న సంబంధము తెగదు.

నేను అనే తలంపు మన లోపలనుండి వస్తోంది అని మనకు తెలుస్తోంది. కాని ఏ స్థానము నుండి వస్తుందో మనకు తెలియటం లేదు. అది ఆధ్యాత్మిక హృదయం నుండి వస్తోంది. నేను అన్నప్పుడు మనకు దేహము వ్యక్తమవుతున్నంతకాలము పునర్జన్మ వచ్చితీరుతుంది. ఇది అబద్ధమైన నేను. ఇది దేహం లేకుండా ఉండలేదు అందువలన దేహం వస్తుంది. నిజమైన నేనుకు దేహంతో పనిలేదు. నిజమైన నేను ఉపాదిరహితుడు.

అహంకారము ఉంటే మనస్సు వచ్చేస్తుంది, మనస్సు ఉంటే దేహము వచ్చేస్తుంది. మనస్సులో వచ్చే ప్రతీ వికారము దేహము మీద కనబడుతుంది. ఎందుచేతనంటే ఈ దేహము నాది అని మనస్సు అనుకొంటుంది. దేహం కొంతకాలం పనిచేసాక శిథిలం అయి రాలిపోతుంది. మరల ఇంకో దేహం వస్తుంది. దేహాలు మరణిస్తూ ఉంటాయి, పుడుతూ ఉంటాయి. శారీరక రోగాలు, శారీరక కర్మలు శ్మశానంతో ముగుస్తాయి. కాని మానసిక కర్మకు మనం సమాధానం చెపితేనే గాని అది ముగియదు. మానసిక కర్మ పూర్తిగా కరిగిపోతేనే గాని మోక్షం రాదు.

బాహ్యకారణములవలన వచ్చే సుఖం నిలబడదు. ప్రకృతి గొడవలు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వాటి మీద ఆధారపడకుండా అవ్యయ, అభవ, పూర్ణ చిత్ సుఖమును నీవు పొందాలి అని భగవాన్ చెపుతున్నారు. మనం ప్రకృతి సుఖాలను కూడా అనుభవిస్తాము. ప్రకృతి సుఖాలను అనుభవించేటప్పుడు పరిణామంలో వచ్చే దుఃఖమునకు బీజం పడిపోతుంది. ప్రకృతి సుఖాలు

అనుభవించేటప్పుడు మొదట తియ్యగా ఉంటాయి. పరిణామంలో చేదుగా మారతాయి. ఆత్మకు సంబంధించిన విషయాలు మొదట మనకు శ్రద్ధ సరిగాలేనపుడు చేదుగా అనిపిస్తాయి. పరిణామంలో తియ్యగా మారిపోతాయి. పూర్ణమైన సుఖమును ఇస్తాయి. దేహం ఉన్నా లేకపోయినా, లోకం ఉన్నా లేకపోయినా నీ సుఖమునకు రవ్వంత కూడా లోటు ఉండదు. అప్పుడు మనం స్వతంత్రులమవుతాము. అంతవరకూ బానిసలుగా ఉంటాము.

ఉదయం జీవుడు హృదయంలో నుండి శిరస్సులోనికి వచ్చేస్తాడు. శిరస్సులోనికి రావటంతోటే గొడవలు అన్నీ వచ్చేస్తాయి. రాత్రి ఏ గొడవలేదు. జీవుడు శిరస్సులోనికి రాగానే తలంపులు వస్తాయి. తరువాత నామము, రూపము, ప్రపంచము అన్నీ వస్తాయి. తలంపులు లేకపోతే ఏమీలేదు. తలంపులు వచ్చాక నామంతోటి రూపంతోటి పరిసరాలతోటి తాదాప్యం పొందుతాడు. అప్పుడు పనిచేయటం ప్రారంభిస్తాడు. రాగ ద్వేషములతో పనిచేస్తాడు. కర్మ చుట్టుకుంటుంది. కొత్త వాసనలు పుడతాయి. పాత వాసనలను ఎలాగూ పోగొట్టుకోవటంలేదు సరికదా ఇక్కడ కొత్త వాసనలు కూడా కలసి అనంతమైన జన్మలకు బీజములు తయారవుతాయి.

వైకుంఠము అంటే ఎక్కడో ఉంది అనుకొంటున్నారు. నీ మనస్సు ఎక్కడైతే అణిగిందో అక్కడే వైకుంఠము ఉంది అన్నారు భగవాన్. అక్కడే చైతన్యం ఉంది అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు. మనకు రూపదృష్టి ఎక్కువ, శవదృష్టి ఎక్కువ. శివదృష్టి తక్కువ. మనకు శవాలమీద ఉన్న ప్రేమ శివుడిమీద ఉండదు. శివుడు మీద ప్రేమ కలిగితే శవం మీద ఉన్న ప్రేమ తగ్గుతుంది.

శరీరము కంటే ఇంద్రియాలు గొప్పవి, ఇంద్రియాలకంటే మనస్సు గొప్పది, మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే ఆత్మ గొప్పది, అదీ నేనే అని భగవంతుడు చెప్పాడు. అందువలన ఆత్మేగమ్యంగా పెట్టుకోవాలి.

ఉన్నది ఒకటే వస్తువు. అది మన హృదయంలో ఉంది. అది అనుభవంలోనికి రాకుండా మన మనస్సు అడ్డు వస్తోంది. గుణాలు, రాబోయే జన్మలు అన్నీ కూడా మనస్సులో ఉన్నాయి. మనస్సు నశిస్తే అన్నీ పోతాయి. హృదయంలో మనస్సును నిలబెడితే అది నశిస్తుంది. మనస్సు ఎక్కడైతే నశించిందో అక్కడ ఆత్మ వ్యక్తమవుతుంది. మనస్సు నశించినపుడు నీవు నష్టపోవు. ఆత్మలాభమును పొందుతావు. ఆత్మ గుణాలు నీకు వస్తాయి.

శాంతి కావాలి అం( )న్నావు. అది ఎక్కడ ఉందో అక్కడ వెదికితే దొరకుతుంది. ప్రకృతిలో వెదికితే అది దొరకదు. ఎందుకంటే ప్రకృతిలో శాంతి లేదు. శాంతి నీ హృదయంలో ఉంది అని భగవంతుడు చెప్పుచున్నాడు. మనం అక్కడకు వెళ్ళగలగాలి. శాంతి ఎక్కడ ఉందో Correct address భగవంతుడు చెపుతున్నాడు. ముందు మనకు భగవంతుడు చెప్పిన మాటలమీద నమ్మకం కలగాలి. పూర్వ జన్మలో పుణ్య కర్మ చేసి ఉండకపోతే భగవంతుడు చెప్పిన మాటలమీద విశ్వాసం కలుగదు. దేవుడు వేరు, దేవుడు చెప్పిన వాక్యం వేరు కాదు. ఆ వాక్యము దేవుడై ఉన్నది. ఆ వాక్యము అర్థమైతే దేవుడు పొందే సుఖము, శాంతి, మిమ్ములను కూడా వరిస్తాయి. దేవుడి నామము వేరు, దేవుడు వేరు కాదు. నామము చేసేటప్పుడు ప్రీతితో, ప్రేమతో, గౌరవముతో చెయ్యాలి. నామమును ప్రేమతో చేసినపుడు నీ మనస్సు అంతర్ముఖమవుతుంది. నీవు ప్రేమించే దేవుడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఎప్పుడైతే నీ మనస్సు అంతర్ముఖమయిందో ఆ దేవుడు నీ మనస్సును

హృదయంలోనికి గుంజుకుంటాడు.

దేహమును వదిలించుకోవటం తేలికే. అది ఏదో ఒకరోజు చనిపోతుంది. కాని అహంకారమును వదిలించుకోవటం చాలా కష్టం. ప్రతీ జన్మలోనూ అది మనకూడా వస్తుంది. దీనిని వదిలించుకుంటే జ్ఞానమే. పరిసరాలు మారినా, కుటుంబాలు మారినా, స్నేహితులు మారినా అహంకారము నీకూడానే వచ్చేస్తుంది. దీనిని వదిలించుకోవాలి. దీనిని వదలించుకోవడానికే సాధన. శాస్త్రములు చదవటం, గురువు చెప్పిన మాటలు శ్రవణం చేయుటం ఈ పీడ వదలించుకోవడానికే.

సాధన చేసేటప్పుడు నీ చైతన్య స్థాయి పెరుగుతుంది, సిద్ధులు రావచ్చును. అది చూసి గర్వపడకండి. గర్వం వస్తే ఉన్నది పాడవుతుంది. వినయమును కాపాడుకోండి వినయమే మోక్షమును సంపాదించిపెడుతుంది. ఎగిరిపడవద్దు. అణిగి ఉండండి. అణిగి ఉండటం వలన ఆత్మానుభవం కలుగుతుంది.

మీకు ఇష్టం లేకపోతే నా మాటలుకాదని అనవచ్చు. నా చేతలు కాదని అనవచ్చు. నా అనుభవము కాదని అనలేరు. ఒక జ్ఞాని దగ్గరకు వెళ్లి దేవుడు లేడు అంటే వాడు కంగారు పడడు. ఎందుకంటే వాడికి ఉండే అనుభవం వాడికి ఉంటుంది. వాడు స్వతంత్రుడు. మీకు స్వంత అనుభవం లేనపుడు చెప్పుడు మాటలు పట్టుకొని ఉంటారు. ఎవడు ఏ మాట చెప్పినా దానికి తల ఊపుతారు. మీకు స్వంత అనుభవం ఉన్నపుడు తల ఊపవలసిన అవసరం లేదు.

భౌతిక విషయమైనా, పారమార్థిక విషయమైనా సాధించాలంటే ముందు మనస్సుకు నిలకడ ఉండాలి. మనిషికి రెండు ప్రకృతిలు ఉంటాయి. 1. బాహ్య ప్రకృతి, 2. లోపల ప్రకృతి. మనిషి అయ్యాక బయుట ప్రకృతిని స్వాధీనంలోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి లేకపోతే లోపల ప్రకృతిని స్వాధీనంలోనికి తెచ్చుకోవటానికి అంటే ఆత్మానుభవం కలగకుండా అడ్డువచ్చే నీలోని దుర్గుణాలను తొలగించుకోవటానికి ప్రయత్నించాలి. ఎవడైతే బాహ్య ప్రకృతిని గాని, లోపల ప్రకృతిని లేక రెండింటిని గాని స్వాధీనంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాడో వాడే మనిషి అని చెప్పబడును అని స్వామి వివేకానంద చెప్పారు.

మన హృదయంలో ఉన్న వస్తువు గురించి తెలుసుకోవటానికి భగవాన్ మార్గత్రయమును చెప్పారు. 1. ఆత్మను వెతుకు అది దొరకుతుంది. 2. ఆత్మలో ములుగు అంటే నీ మనస్సును తీసుకొని వెళ్లి ఆత్మలో ముంచు. అప్పుడు మనస్సు అందులో కరిగిపోతుంది. కరిగిపోయినపుడు మనస్సు పోయి ఆత్మగా మిగులుతావు. ఇవి రెండూ సూక్ష్మబుద్ధి ఉన్నవారికి సరిపోతాయి. 3. ప్రాణాయామం. స్థూలబుద్ధి ఉన్నవారికి ప్రాణాయామం చెప్పారు. ముక్కులో గాలి తిరుగుతూ ఉంటుంది కదా దానిని గమనించు. మనస్సు ఎక్కడపుడుతోందో ముక్కులో తిరిగే గాలి అంటే ప్రాణం కూడా అక్కడే పుడుతోంది. మనస్సు ఆలోచించుకొనే శక్తిని ఇస్తుంది. ప్రాణం మనకు పనిచేసే శక్తిని ఇస్తుంది. ఇవి రెండూ ఒకేచోట పుడుతున్నాయి. ప్రాణంను నియమించడం వలన మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. స్వాధీనంలోనికి వచ్చినమనస్సు ఆత్మను తెలుసుకోవడానికి అర్హత పొందుతుంది.

మనస్సు హృదయంలో ఉంటే ఊరక ఉంటుంది. మనస్సు శిరస్సులో ఉన్నప్పుడు ఊరక ఉండదు, విజృంభిస్తూ ఉంటుంది. మనస్సు అంటే ఏమిటి అని నిరంతరము వెతకటం వలన అదిలేదు అని తెలుస్తుంది అన్నారు భగవాన్. సత్యమును వెతికేది మనస్సే. నీవు ఎప్పుడైతే సత్యమును వెతకటం ప్రారంభించావో ఆ

అన్వేషణలోనే మనస్సు కరిగిపోతుంది.

మీరు ఎవరిమీద నిష్ఠూరములు వేయవద్దు. మీరు బాగుపడినా, పాడైపోయినా దానికి మీ మనస్సే కారణము. మీ మనస్సు స్వాధీనంలో ఉంటే మీరు బాగుపడతారు. మీ మనస్సు స్వాధీనంలో లేకపోతే మీరు చెడిపోతారు. మీ విధి మీ చేతులలో నే ఉంది. మీ బాగు మీ చేతులలోనే ఉంది అని భగవంతుడు చెపుతున్నాడు.

నా మనస్సుకు కుదురులేదు అని అంటే నీ మనస్సుకు కుదురు లేకపోతే నీకెందుకు మనస్సువు నీవు కాదు కదా అనేవారు భగవాన్. నేను మనస్సునే అని అంటే అయితే గాఢ నిద్రలో నీ మనస్సు ఏమయింది అనేవారు. మనస్సువు నువ్వే అయితే గాఢ నిద్రలో అది నిన్ను విడిచి పెట్టకూడదు. కాని నీకు గాఢ నిద్రలో దాని గొడవ లేదు. ఏదైతే నీవు కాదో దాని నుండి విడిపోతావు గాని ఏదైతే నువ్వో దాని నుండి నీవు విడిపోలేవు. మనస్సు నీవు కాదు కాబట్టి గాఢ నిద్రలో దాని నుండి విడిపోతున్నావు. మనస్సులో గొడవ ఉంటే ఉండనియ్యి. అది నువ్వు కాదు. ఏదైతే మనం ఏది కాదో అదే అవును అనుకొంటున్నాము. అందువలన జన్మ పరంపరలు వస్తున్నాయి. ఏదైతే మర్చిపోవాలో అదే తల పెట్టుకొంటున్నాము. అవి పెరుగుతున్నాయి అంటే మనస్సు పెరుగుతోంది: ఒక బ్రహ్మము తప్ప అంతా మనో విలాసము.

నేను అనే తలంపు నీలోపల నుండి వస్తోంది కాబట్టి నీవే వెతకాలి. బయట నుండి వస్తే ఇక్కడ నుండి వస్తోంది అని ఎవరైనా చెప్పవచ్చు. నేను అనే తలంపు ఎక్కడ నుండి పుడుతుందో వెతకటమే నిజమైన విచారణ. నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో తెలిస్తే ఆ మిగిలినవన్నీ అబద్దాలు అని చెప్పకుండా చెపుతున్నారు. ఏ శక్తి ఈ సృష్టిని నడుపుతుందో అది నీకు స్వాధీనం మరుక్షణంలో నీకు మహాశక్తి స్వాధీనం అవుతుంది. అవుతుంది.

సంసారంలో ఉన్న కష్టాలు పోయిన తరువాత సాధన చేద్దాము అని అనుకోవద్దు. సముద్రమునకు స్నానం కోసం వెళ్లినవాడు కెరటాలకు, కెరటాలకు మధ్య ఎలా స్నానం చేసి వస్తాడో అలాగే సంసారంలో ఉంటూనే కష్టాలకు సుఖాలకు మద్య సాధన చేసి మీరు తరించండి. కష్టాలు తగ్గాక సాధన చేద్దాము అనుకుంటే శరీరము ఉంటుందో ఉండదో చెప్పలేము.

వాల్మీకి మాయ అంతా డబ్బులో ఉంది అని చెప్పాడు. ఆయన బాహ్య దృష్టితో చెప్పాడు. మనం లోపల దృష్టితో చూసినపుడు మాయ అంతా అహంభావనలో ఉంది. నలుగురు కూర్చొని మాట్లాడుకునేటప్పుడు చూడండి ఆ సంభాషణకు అహంభావన base అయి ఉంటుంది. మనం మాట్లాడే ప్రతీమాటకు అహంభావన base అయి ఉంటుంది. పరిశీలన చేసి చూసుకోండి. అహంభావన కారణంగా వచ్చే ప్రతీమాట మరల అహంభావనను పెంచుతుంది.

అందరూ సాధన చేస్తున్నారు. మనస్సు రవ్వంత, ముల్లంత లోపలకు దిగటం లేదు. నదులలోనూ, సముద్రంలోను మునగటం తేలిక. హృదయంలో మునగటం అంత తేలిక కాదు. నదులలో మునగటానికి మనస్సును నిగ్రహించనక్కరలేదు. హృదయంలో మునగటానికి మనస్సును నిగ్రహించాలి.

అహంకారముతో చేసే కర్మ మనలను చుట్టుకొంటుంది. అహంకారము లేకుండా చేసే కర్మ అకర్మ కాబట్టి

అది నిన్ను చుట్టుకోదు. కొత్త వాసన ఏమీ పడదు. ఆ స్థితిని పొంది నీవు మూడు లోకములు దహనం చేసినా నీకు పాపం అంటదు అని అర్జునుడుతో కృష్ణపరమాత్మ చెప్పాడు. ఎందుచేతనంటే అక్కడ కర్తృత్వంలేదు. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు అందకుండా చేసేది నీ దేహము కాదు, అహంభావన చేస్తోంది. నెపం ఎవరి మీద పెట్టవద్దు. అహంభావన తొలగించుకోవడానికి చేసే ప్రయత్నమే సాధన.

నేను లోపలనుండి వస్తోంది అని తెలుస్తోంది. దాని మూలంగా ఆత్మ ఉంది అని చెపుతున్నారు అది తెలియటం లేదు అని అంటే ఇవి అన్నీ మనోభావనలు అనిచెప్పారు. తెలియటం, తెలియకపోవటం ఇవి అన్నీ నీ మనోభావనలు. వీటికి అతీతంగా ఉంది ఆత్మ. ఈ అనుమానాలకు, సందేహాలకు, ఊహలకు అతీతంగా ఉంది ఆత్మ. నీకు తెలుసున్నా, తెలియకపోయినా నీవు ఆత్మవే. తెలిసి ఉంటే సుఖపడతావు. తెలియకపోతే ఏ లోకంలోనికి వెళ్లినా దుఃఖము నిన్ను వెంటాడుతుంది.

అహంకారము తిరుగుబోతు. అది పడుతూ ఉంటుంది. లెగుస్తూ ఉంటుంది. దానికి దెబ్బలు తగిలినపుడు, అలిసి పోయినపుడు అణిగి ఉంటుంది. అణిగి ఉన్నప్పుడే ప్రమాదము అప్పుడు మనకు జ్ఞానం వచ్చేసింది అనిపిస్తుంది. అలా అనుకోవద్దు. అది మరల మనలను పడేస్తుంది.

మనస్సు అసత్యమును నమ్మినట్లు సత్యమును నమ్మదు ఎందుచేతనంటే అది అసత్యము కాబట్టి. ఏ మనస్సు అయితే నీకు నేనుగా వ్యక్తమవుతోందో దానిని నాశనం చేసుకోగలిగితే యదార్థమైన జ్ఞానం నీ హృదయంలో ఉంది కాబట్టి అది నీకు తానుగా వ్యక్తమవుతుంది.

అహంభావన అనేది ఒక తలంపు. దాని మూలంలోనికి ఈ నాటికైనా, ఏనాటికైనా ఎవ్వరైనా చేరవలసిందే. అహంభావన మూలంలోనికి వెళ్లేవరకూ అహంభావన అంతమవ్వదు. అహంభావన అంతమయ్యే వరకూ దుఃఖాలు, కలతలు, వేదనలు, జన్మ పరంపరలు అంతమవ్వవు. నీవు ఈ జన్మలో ఉన్నా, మరో జన్మలో ఉన్నా, ఏ లోకంలో ఉన్నా, ఏ ఉపాధిలో ఉన్నా, ఏ నామంలో ఉన్నా, ఏ పరిసరాలలో ఉన్నా అహంభావన మూలంలోనికి వెళ్లటమే నీవు చేయవలసిన సాధన.

ఈ జన్మలో చేయలేని పని వచ్చే జన్మలో చేస్తావని నమ్మకం ఏముంది. ఈ లోకంలో చేయలేని పని పరలోకంలో చేస్తావని నిర్ధారణ ఎక్కడ ఉంది. భగవంతుడు అన్ని అవకాశములు ఇచ్చినపుడు సాధన చేయకపోతే అవకాశములు లేనపుడు ఏమి సాధన చేయగలవు. వర్తమాన కాలమును జాగ్రత్తగా ఉపయోగించుకోండి. భగవంతుడు ఏ అవకాశములు ఇచ్చాడో వాటిని సద్వినియోగం చేసుకోకపోతే రాబోయే జన్మలలో ఈ అవకాశములు కూడా ఇవ్వడు. భగవంతుడు ఇచ్చిన అవకాశములు ఎవడైతే సద్వినియోగం చేసుకొంటున్నాడో వాడికి higher birth ఇస్తాడు, ఇంకా ఎక్కువ అవకాశములు ఇస్తాడు.

అహంభావన తొలగించుకోవటానికి ఎవడూ ప్రయత్నం చేయడు. ఎందుకంటే అహంభావనే వాడు అనుకొంటున్నాడు. అహంభావన తొలగించుకోవటానికి చేసే ప్రయత్నమే నిజమైన విచారణ. ఏది వచ్చిన తరువాత అన్నీ వస్తున్నాయో దానిని తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే నిజమైన విచారణ. అహంభావనపోతే వాడు పోడు. ఒక మహాశక్తి వాడికి హస్తగతమవుతుంది.

*(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము 28-11-95)*